## అమృత్ కిరణ్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# విధ్వంసకాండ

-కన్నేపల్లి చలమయ్యశాస్త్రి

విశాఖపట్నం

నగరం నడిబొడ్డున 'రాజీవ్' అపార్ట్‌మెంట్స్... నాలుగంతస్థుల ఆ బ్లాక్ మూడో అంతస్థులో ట్యూబ్‌లైట్ వెలుగుతోంది.

టీ.వీ. నడుస్తూనే ఉంది.

అప్పుడు సమయం రాత్రి తొమ్మిదిన్నర.

"ఇంత రాత్రయినా ఇంకా నిద్రపోరేమిటర్రా?" టి.వి. చూస్తోన్న పిల్లల్ని మందలించాడు రత్నాకర్.

"హారర్ షో వస్తోంది పప్పా - అదిచూసి పడుకుంటాం." బదులిచ్చింది పదేళ్ళ స్రవంతి.

"ఏం హారర్ షానో ఏమిటో - రాత్రంతా భయంతో ఒహటే కలవరిస్తారు. తెల్లారి లేవడానికి బద్దకిస్తారు హోమ్ వర్క్‌లు?" అంది నందిని.

"హోం వర్క్‌లు చేసేశాం మమ్మీ.. హారర్ షో అంటే మాకేం భయంలేదు. ప్రతీవారం చూస్తూనేఉన్నాంగా!" తల్లి మాటల్ని కొట్టిపడేశాడు పన్నెండేళ్ళ పునీత్.

"ఆల్‌రైట్ - మీ ఇష్టం. మాకు నిద్రముంచుకొస్తోంది. పడుకునే ముందు టీ.వి. కట్టెయ్యడం మరచిపోకండి."

"గుడ్‌నైట్ మమ్మీ - గుడ్‌నైట్ పప్పా!"

రత్నాకర్, నందిని అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు.

స్రవంతి, పునీత్ టి.వి చూస్తున్నారు శ్రద్ధగా.

తొమ్మిది గంటల ముప్పయ్ అయిదు నిముషాలు.

భయంకర నేపథ్య సంగీతంలో హారర్ షో ప్రారంభమయింది.

పిక్నిక్‌కని బయల్దేరిన రెండు యువజంటలు అవాంఛనీయ పరిస్థితుల్లో ఒకరాత్రి ఆ శిధిల భవనంలో తలదాచుకుంటారు. క్షుద్రశక్తులు ఆవరించుకున్న ఆ భవనంలో విచిత్రమైన అనుభవాలు ఎదురైనాయివారికి. అందులో ఒక అమ్మాయిని దెయ్యం ఆవహించింది. హిస్టీరిక్‌గా ప్రవర్తిస్తూ, తన ప్రియుడినే హత్య చేసేస్తుంది.

ఆ వారం ఎపిసోడ్ ముగిసింది.

"మైగాడ్ - వచ్చేవారం మిగిలిన వాళ్ళకి ఈ గతే పడుతుందేమో!"

"లేదు. ఈలోగా తెల్లారిపోతుంది. తెల్లారితే దయ్యాలశక్తి క్షీణిస్తుంది. మిగిలిన వాళ్ళు తప్పించుకుంటారు." చెల్లెలి భయాన్ని పోగొట్టడానికి అలా అన్నాడు పునీత్.

"సర్లే, టి.వీ కట్టెయ్. నిద్రోస్తోంది."

పునీత్ టి.వి దగ్గరకు నడిచాడు.

ఇంతలో -

తెరమీద గజబిజిగా గీతలు, చీప్ చీప్‌మన్న శబ్దం, ఆ వెనుక టైప్ చేస్తోన్నట్టు ఒక్కో ఇంగ్లీష్ అక్షరమూ టీ.వీ తెరమీద కనిపించాయి. అక్షరాలన్నీ ఒక వాక్యంగా తయారయ్యాయి. కూడబలుక్కుంటూ చదివాడు పునీత్.

THIS SUNDAY
BLAST RAILWAY STATION
REPEAT BLAST R.S.

ముప్పై సెకండ్లపాటు తెరమీద ఆ వాక్యం నిల్చి మాయమయింది.

"ఇదేదో కొత్త ఎడ్వర్టయిజ్‌మెంట్‌లా ఉంది.

టీ.వీ. కట్టేసి పదపడుక్కుందాం." అంటూ చెల్లాయిని నడిపించాడు పునీత్.

★ ★ ★

ఆదివారం-

మధ్యాహ్నం మూడు గంటలు.

సింహం వెంటబడితే ప్రాణభీతితో పరుగులిడే మృగాల్లా సైరన్ మ్రోగించుకుంటూ బారులు తీరిన అంబులెన్సులూ, గంటలు మ్రోగించుకుంటూ రొద రొదగా సాగుతున్న ఫైర్‌ఇంజన్లూ, వాటి ననుసరిస్తూ పోలీసు వ్యాన్లూ - నగరం ఖాళీ అయినట్టు అనిపిస్తోంది. అందరిలానే బాల్కనీలోకి పరిగెత్తి ఆ ప్రొసెషన్ విచిత్రంగా చూస్తున్నారు స్రవంతి, పునీత్.

"ఎక్కడో పెద్ద ప్రమాదం జరిగి నట్టుంది" అంది నందిని చదరంగం ఆడుతున్న భర్తతో.

హాల్లో ఫోన్ మ్రోగుతోంది. రత్నాకర్ లేచి రిసీవ్ చేసుకున్నాడు. అతని మొహం పాలిపోయింది. విభ్రాంతితో కళ్ళు పెద్దవయ్యాయి.

ఫోన్ పెట్టేసి రెండే నిమిషాల్లో తయారైన భర్తను జాలిగా చూసింది నందిని.

ఏం ఉద్యోగమో?

ఎక్కడే ప్రమాదం జరిగినా పోలీసులూ, ఫైరు సర్వీస్, డాక్టర్లూ, తన భర్తలాంటి రిపోర్టర్లు తప్పరు.

వెళ్తూ ద్వారం వద్ద ఆగి చెప్పాడు రత్నాకర్ భార్యతో.

"రాఘవ ఫోన్ చేశాడు. పావుగంటక్రితం రైల్వేస్టేషన్ బ్లాస్ట్ అయిందట. బొంబాయి బ్లాస్టకన్నా ఇది భయంకరమైనదట. రాజధాని ఎక్స్‌ప్రెస్ సరిగ్గా అప్పుడే వచ్చిందట-"

"పాపం ఎన్నికుటుంబాలు దిక్కులేనివయ్యాయో."

మోటర్ బైక్ స్టార్ట్ చేస్తూ తండ్రి శరవేగంతో వెళ్తూంటే అన్నచెవిలో గుసగుస లాడింది స్రవంతి." మొన్నరాత్రి టి.వీలో మనంచూసింది నిజమేనేమిట్రా అన్నయ్యా?"

"అలానే ఉంది."

"మమ్మీకి చెబుదామా?" ఉత్కంఠతో అంది.

"ఒద్దు నమ్మదు. మనల్నిమరి టి.వి.చూడనియ్యదు."

భయంకర విధ్వంసకాండకు పునాదిరాయిలా శ్రీకారం చుట్టిన ఈ సంఘటన వాళ్ళను కలవర పర్చింది.

సోమవారం నుండి చదువులూ, ఎసైన్‌మెంట్లూ, స్కూల్ రొటీన్‌లో పడ్డారు.

★ ★ ★

శుక్రవారం వచ్చింది.

హోమ్‌వర్క్ పూర్తిచేసి పేచీపెట్టకుండా భోజనాలు చేస్తోన్న పిల్లల్ని నవ్వుతూ అడిగింది నందిని. "టీ.వి. పెళ్ళివారు తోటసంబరానికి రెడీ అయ్యారన్నమాట. ఎందుకర్రా ఈ హారర్ షోలు చూస్తారు?"

"రోజంతా ఘంటసాల పాటలువింటూ కిచెన్‌లో నువ్ పనిచేసుకోవడం లేదూ?" దబాయించింది స్రవంతి.


"సరిగ్గా నీకు, తగినట్టుగా చెప్పింది." అన్నాడు రత్నాకర్.

తొమ్మిదిన్నరకు-

కొన్ని వాణిజ్య ప్రకటనల తర్వాత హారర్ పిక్చర్ బిగినయింది.

దెయ్యంగా మారిన అమ్మాయి శిథిలభవనంలో ఎక్కడో దాక్కుంటుంది.

మిగిలిన జంటను అనుమానంమీద అరెస్టుచేసి భవనానికి వెళ్ళాడు ఇన్‌స్పెక్టర్. హఠాత్తుగా దాడిచేసి అమానుషంగా అతణ్ణి హత్యచేస్తుంది దెయ్యం పట్టిన



అమ్మాయి. మొండెం విల విలా తన్నుకుంటుండగా తనచేతిలో అతని తలను పట్టుకుని అందులోంచి ఫౌంటెన్‌లా చిమ్ముతోన్న రక్తాన్ని ఆబగా జుర్రుకుంటోంది.

ఊపిరిపీల్చడం మర్చిపోయారు పునీత్, స్రవంతి.

హారర్‌షో ముగిసింది.

గజిబిజి గీతలు, చీప్‌చీప్ మన్న శబ్దం పునీత్‌ని ఎలర్ట్‌చేశాయి.

కాగితం, పెన్ను అందుకుంది స్రవంతి.

ఒక్కొక్కటగా ప్రింటవుతూ అక్షరాలు.

THIS SUNDAY
BLAST CINE THEATRE
REPEAT THEATRE

నోట్ చేసింది స్రవంతి. బయంగా చూస్తోన్న పునీత్‌ని కుదుపుతూ అడిగింది. "డాడీకి చెబుదామా?"

"పద"

బెడ్‌రూమ్ లాక్‌చేసి ఉంది.

"పోనీలే, రేపు చెబుదాం."

తెల్లవార్తూనే తమ చదువులోపడ్డ ఆ పసి పిల్లలు జరుగబోయే అనర్థాల్ని గురించి తల్లిదండ్రులకు చెప్పాలని గుర్తు రాలేదు.

ఆదివారం

సాయంత్రం అయిదు గంటలు. వీధిలోనుండి వస్తూనే భార్యను హడావుడి చేశాడు రత్నాకర్. "నందినీ -పిల్లల్ని త్వరగా తయారుచేసి నువ్వూ రెడీ అవ్వు."

"ఎక్కడకండీ?"

"జురాసిక్ పార్క్ సినిమాకు టిక్కెట్లు బుక్ చేశాడు రాఘవ. చూడచక్కని సినిమానట. జనం విరగబడి చూస్తున్నారు."

స్రవంతి, పునీత్ మొహాలు చూసుకున్నారు. గుండెలు దడదడలాడేయి.

"ఒద్దు డాడీ - మాకు సినిమా ఇష్టం లేదు."

వింతగా చూశాడు రాఘవ. సినిమా అంటే ఎగిరి గంతేసే ఈ పిల్లలు ఒద్దంటున్నారెందుకో?

"రాఘవ ఫేమిలీవస్తారమ్మా - సుచిత్ర, కార్తీక్..."

"ఒద్దు పప్పా! మేము సినిమా చూడం. టిక్కెట్లుకాన్సిల్ చేయమని రాఘవంకుల్‌కి ఫోన్‌చేసి చెప్పేయండి."

"సర్లే- మేముకూడా వెళ్ళకపోతే రాఘవనొచ్చుకుంటాడు. మీ ఇద్దరూ బుద్ధిగా ఇంట్లో ఉండండి మేం వెళ్తాం."

"డాడీ మీరూ సినిమాకువెళ్ళొద్దు. మామీద ఒట్టు" కాళ్ళు చుట్టేసింది స్రవంతి.

"రాఘవంకుల్ క్కూడా వెళ్ళొద్దని చెప్పండి ప్లీజ్... ఈరోజు సినిమాకి వెళ్ళకూడదు డాడీ-"

"ఏం జరిగిందిరా? ఎందుకింతడ్రామా చేస్తున్నారు?"

"డ్రామా కాదు పప్పా! ఈరోజు సినిమా హాల్ బ్లాస్టవుతుంది."

తను నోట్ చేసిన కాగితాన్ని చూపించింది స్రవంతి.

గతవారం జరిగిన రైల్వేస్టేషన్ బ్లాస్ట్ గురించిన హెచ్చరిక కూడా తెలీచెప్పారు.

"షిట్... హారర్‌షోలు, క్రైమ్ థ్రిల్లర్స్ చూసి చూసి మీ బుర్రలు పాడయ్యాయి. విధ్వంసం తలపెట్టినవాడు బహిరంగంగా హెచ్చరిస్తాడా? అదీ ఏ పోలీసు అధికారులకో రాజకీయ నాయకులకో కాక మనలాంటి సామాన్యులకు?"

హాల్లో ఫోన్ రింగవుతోంది.

రత్నాకర్ అందుకున్నాడు. అది రాఘవనుండి.

అకస్మాత్తుగా ఫేమిలీతో ఢిల్లీనుండి అతని బామ్మర్ది దిగబడ్డాడట. సినిమా ప్రోగ్రాం కాన్సిల్ అయినందుకు, పిల్లల్ని డిజప్పాయింట్ చేసినందుకు క్షమాపణ చెబుతూ.

"థాంక్‌గాడ్..." ఊపిరి పీల్చుకున్నారు పిల్లలు.

రాత్రి ఎనిమిది గంటలప్పుడు-

భూకంపం వచ్చిన మహారణ్యంలో జాతిశత్రుత్వాన్ని మరిచి ఆత్మరక్షణ కోసం కలిసి పరుగులు తీస్తోన్న పులులూ, లేళ్ళలా పోలీసు జీపులూ, ఫైరింజన్లూ, అంబులెన్సులూ రొదరొదగా సాగిపోతుంటే చటుక్కున బాల్కనీలోకి పరిగెత్తారు పిల్లలు.

రింగవుతోన్న ఫోనందుకుంది నందిని.

ఆమె మొహం పాలిపోయింది. మస్తిష్కం మొద్దుబారింది.

చేతిలోంచి రిసీవర్ జారిపోయింది.

"ఏమయింది?" రెండంగల్లో ఆమెను చేరాడు రత్నాకర్.

భర్తను చుట్టుకుపోతూ భయంతో చెప్పింది "మనం వెళ్దామనుకున్న సినిమాహాల్ బ్రద్దలయింది. రాఘవన్నయ్య ఫోన్ చేశాడు.

★ ★ ★

స్కూల్ బ్యాగులు భుజాన వేస్కొని మమ్మీకి బై చెప్పి మెట్లు దిగుతోన్న పిల్లలకు మెట్లెక్కుతూ ఎదురొస్తున్నాడు సైమన్ అంకుల్.

"గుడ్మార్నింగ్ అంకుల్."

"గుడ్మార్నింగ్ స్వీట్ కిడ్స్." అంటూ పొడవాటి లాల్చీ జేబులోంచి క్యాడ్‌బరీస్ చాక్లెటుబార్స్ ఇచ్చాడు పిల్లలకు.

"థాంక్యూ అంకుల్."

"నైస్‌కిడ్స్ - బాగా చదువు కోవాలి."

వీధి మలుపులో స్కూలు బస్సుకోసం ఎదురు చూస్తున్నప్పుడు అన్నతో అంది స్రవంతి." అంకుల్ చాలా మంచివాడు రా అన్నయ్యా!"

## బాలీవుడ్‌లో సుస్మిత



1994లో 'మిస్ యూనివర్స్'గా ఎన్నికైన సుస్మితా సేన్ ఇప్పుడు 'మాజీ విశ్వసుందరి' అయింది. ఆమెతో చిత్రాలు నిర్మించడానికి అప్పట్లో ఎంతో మంది ముందు కొచ్చారు. కానీ వేటినీ ఆమె అంగీకరించలేదు. ఎన్ని 'కిరీటాలు' లభించినా సినిమాల ద్వారా వచ్చే క్రేజే క్రేజ్ అనే సంగతి గ్రహించినట్టుంది. ఇప్పుడో హిందీ చిత్రంలో నటించడానికి అంగీకరించింది. అయితే హీరోయే కాస్త పెద్దవాడు. మరెవరో కాదు - వినోద్‌ఖన్నా, ఓ సౌత్ ఆఫ్రికా ఆసామీ తీస్తోన్న ఈ చిత్రం సుస్మితకి సినిమాల్లో ఎలాంటి గుర్తింపు నిస్తుందో? -మౌర్య.

ఆరు నెలల క్రితం తమ పై పోర్షన్‌లో దిగిన ఈ అంకుల్ ప్లాట్‌లో అందరికీ ఆప్తుడు. ఎవరికే సహాయం కావాలన్నా కాదనక చేస్తాడు. అతని దయాగుణం, సచ్ఛీలతా ఉదాహరణలా చెప్పుకుంటారు.

అంకుల్ ఫామిలీ తీసుకురాలేదు. కాకినాడలో ఉన్నారట. పరీక్షలయ్యాక వాళ్ళను షిఫ్ట్ చేస్తాడట. మార్గరెట్, వర్గీస్ - ఇద్దరూ ఆడపిల్లలేనట.

తమ టీ.వి ఏంటెన్నా ఫిలమెంట్ ఊడింది. డాడీకి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో సైమనంకుల్ ఏంటెన్నాకి తమ తీగల్ని జతపర్చడం గుర్తొచ్చింది పునీత్‌కి. అంకుల్ మంచివాడు, ఏమీ అనడు - సమయం చూసి చెప్పెయ్యాలి!

శుక్రవారం-

కావాలనే పిల్లల్తోపాటు హారర్‌షో చూడ్డానికి కూచున్నాడు రత్నాకర్ వాళ్ళకు ఏ అనుమానమూ రాకుండా.

హారర్ షో పూర్తయింది. మరో ప్రోగ్రాం ఆరంభమైంది.

అతని అనుమానాలు పటాపంచలయ్యాయి.

"హారర్‌షో చూడకండి. మీకన్నీ పిచ్చి పిచ్చి ఊహాలు కలుగుతున్నాయి."

రెండు వారాలపాటు వాళ్ళని హారర్ షో చూడనీయలేదు. మూడోవారం - తల్లితండ్రులు నిద్రపోతున్నారని నిశ్చయమయ్యాక జాగ్రత్తగా టీ.వి ఆన్ చేశాడు పునీత్.

కొత్త ఎపిసోడ్ ఆవారం నుంచే ప్రారంభం.

"మొదటివారం ఏం భయముండదు కదరా?"

"అవునే, పాత్రల పరిచయంతోనే బైమైపోతుంది."

అనుకున్నట్టుగానే హారర్ షో ముగిసింది.

గజ బిజ గీతలూ, చీప్‌చీప్ మన్న శబ్దం. టకటకమంటూ ఇంగ్లీష్ అక్షరాలు - టీ.వి. తెరపై, గబుక్కున పరిగెత్తి తండ్రి బెడ్‌రూమ్ తలుపు దబదబా బాదుతోంది స్రవంతి.

THIS MONDAY
BLAST SCHOOL
REPEAT SCHOOL

పునీత్ గజగజా వణికిపోతున్నాడు.

"ఏం జరిగింది, ఎందుకా కంగారు?" తలుపు తీస్తూ అడిగాడు తండ్రి. డ్రాయింగ్ రూమ్‌లోకి అతన్ని లాక్కొచ్చింది స్రవంతి.


పునీత్ కర్రటాటలా టీ.వి వైపే చూస్తున్నాడు.

"ఏమిట్రా? ఎందుకలా చెమట్లు పట్టాయ్?"

"ఈ సోమవారం - స్కూలు, స్కూలు బ్రద్దలవుతుంది" ట్రాన్స్‌లో ఉన్నట్టు చెప్పాడు పునీత్.

బలంగా నిట్టూర్చాడు రత్నాకర్.

"మీరిద్దరూ మమ్మీ దగ్గర పడుకోండి. నేను మీ




కె.బాలరాజు, తండ్రి:వెంకటేశ్, పోస్ట్:గుండ్లగూడెం, మం:ఆలేరు, జిల్లా:నల్గొండ-508 101.

రూమ్‌లో పడుక్కుంటాను."

"నిజం డాడీ - నేను అబద్ధం చెప్పడం లేదు. భయం వేస్తోంది."

"భయంవేస్తే ఆంజనేయదండకం చదువుకుంటూ నిద్రపోండి."

ఇద్దర్నీ తల్లి దగ్గరకు చేర్చాడు రత్నాకర్.

సోమవారం-

"స్కూల్ బస్సొచ్చే వేళవుతోంది. ఇంకా తయారు కారేవిట్రా?"

విసుక్కుంటోంది నందిని.

"మేం స్కూలుకి వెళ్ళం మమ్మీ-"

"మీ వెర్రివేషాలకు అంతులేకుండా పోతోంది. పది నిముషాల్లో రెడీ కాకపోయారంటే డాడీకి చెబుతాను." హెచ్చరించింది.

తప్పదన్నట్టు తెమిలారు పిల్లలు.

వెళ్తూ వెళ్తూ కన్నీళ్ళు పెట్టుకుంటూ తన చేతుల్ని ముద్దాడుతున్న పిల్లల్నిగదమాయించింది. "మళ్ళీ ఇదేం డ్రామా?".

"సాయంత్రం మేం స్కూలు నుండి తిరిగివస్తామో, లేదో- గుడ్‌బై మమ్మీ, గుడ్ బై ఫరెవర్"

నందిని మనస్సు ద్రవించింది.

'వీళ్ళను సైకియాట్రిస్టుకు చూపించాలి' అనుకుంది.

మెట్లు దిగుతుండగా ఎదురొచ్చాడు సైమన్ అంకుల్.

"హేవ్ ఎ నైస్ డే కిడ్స్" అంటూ చాక్లెట్లు ఇచ్చాడు.

ఉదాసీనంగా, "థాంక్స్" చెప్పి, మెట్లు దిగుతున్న పిల్లల్ని జాలిగా చూశాడు సైమన్. తలకు మించిన చదువులు వాళ్ళవి.

వీధి మలుపు తిరుగుతూ తనకు టాటా చెప్తోన్న పిల్లల్ని బాల్కనీలోంచి తదేకంగా చూస్తోంది నందిని.

ఆమె కుడికన్ను అదిరింది.

ఒక్కసారి కాదు - పదే పదే!!

మధ్యాహ్నం రెండు గంటలు-

అలస్యంగా వచ్చిన భర్తకు వడ్డిస్తూ పిల్లలు స్కూలు కెళ్ళే ముందు చేసిన హంగామా చెప్తోంది నందిని.

విరగబడి నవ్వుతున్నాడు రత్నాకర్.

ఫోన్ రింగవుతోంది.

నందిని అందుకుంది. క్షణంలో ఆమె మొహం కళావిహీనమయింది.

కాళ్ళు వణికి కూలబడింది. "నా పిల్లలు... నా పిల్లలు" అంటూ స్పృహ తప్పింది.

రత్నాకర్ రిసీవర్ అందుకున్నాడు రాఘవ అటువైపు.

ఏడుస్తూ చెప్తున్నాడు." సెంట్ లూయిస్ కాన్వెంట్ బ్లాస్ట్ అయింది. స్రవంతి, పునీత్ స్కూలు కెళ్ళార్రా?"

రత్నాకర్ నిశ్చేష్టుడయ్యాడు. రిసీవర్ జారిపోయింది. బజర్ గణగణ మ్రోగుతోంది. మరబొమ్మలా నడుస్తూ తలుపు తీశాడు ఎదురుగా సైమన్!!

స్కూలు విడిచి పెట్టక మునుపే వచ్చేసినందుకు తమని తండ్రి తిడతాడేమోనన్న భయంతో అతని వెనుక స్రవంతి, పునీత్!

"త్రోవలో కనిపిస్తే తీసుకొచ్చాను." అంటున్నాడు సైమన్.

"లంచ్ బ్రేక్‌లో చెల్లాయికి కడుపునొప్పి వచ్చిందని చెబితే. ప్రిన్సిపాల్‌ని పర్మిషన్ అడిగి వచ్చేశాం డాడీ-" సంజాయిషీ చెబ్తున్నాడు పునీత్.

★ ★ ★

రత్నాకర్ చెప్పిందంతా ఓపిగ్గా విన్నాడు పోలీసు కమీషనర్.

పిల్లల్ని అడిగి వివరాలు తెల్సుకున్నాడు.

"ఈమారు అలాటి దేమన్నా కన్పిస్తే దాన్ని రికార్డ్ చేయండి." అంటూ వి.సి.ఆర్ అమర్చాడు.

మఫ్టీలో పోలీసులు తమ ఫ్లాట్ చుట్టూ తిరగడం. తమ ప్రైవసీకి అంతరాయం కలగడం, తామే నేరస్థు లన్నట్టు పోలీసులు గుచ్చి గుచ్చి చూడ్డం రత్నాకర్‌కి నచ్చలేదు.

రాఘవతో ఈ సంగతి చెబితే "ఈ ఊళ్ళో జరుగుతున్న విధ్వంస కాండకు క్లూ దొరక్క సతమతమవుతున్నారు. మరో దారుణం జరక్కుండా చూడాల్సిన బాధ్యత వాళ్ళ మీదనే ఉంది. కష్టం కలిగినా మనం కోపరేట్ చేయక తప్పదు." అన్నాడు.

రెండు వారాలు ప్రశాంతంగా నడిచాయి.

ఇకపై నిఘా అవసరం లేదని పోలీసులు భావించారు.

శుక్రవారం-

హారర్‌షో ప్రారంభమయినా, దానిమీద మనస్సులగ్నం కావడం లేదు పిల్లలకు.

హారర్ షో ముగిసింది.

గజిబిజి గీతలు, బీప్ బీప్ మన్న శబ్దం - ఉలిక్కి పడ్డారు.

రత్నాకర్ వి.సి.ఆర్. ఆన్ చేశాడు.

తెరమీద అక్షరాలు బైపవుతున్నాయి.

TUESDAY

BLAST TIGER

REPEAT TIGER


ఫోనందుకుని వచ్చిన పోలీసు కమీషనర్‌కు గానీ రాఘవ రత్నాకర్‌లకు గానీ ఈ మెసేజ్‌లో అంతరార్థం బోధపడలేదు.

విశాఖపట్నంలో జరిగిన విధ్వంసకాండ దేశంలో అలజడి సృష్టించింది. రైల్వే స్టేషనూ, సినిమాహాలూ, కాన్వెంట్ స్కూలూ లాంటి జనసమర్ధ ప్రదేశాలు బాంబు దాడికి గురికావడం, వేలకు మించిన సంఖ్యలో ప్రాణనష్టం ప్రజల్నిభీతావహుల్ని చేశాయి.

ఇంత దారుణం జరిగినా, ఇంతవరకూ ఎవర్నీ అరెస్ట్ చేయలేని పోలీస్ డిపార్ట్‌మెంట్ అశక్తతపట్ల ప్రతిపక్షాలు విరుచుకుపడ్డాయి.

అసెంబ్లీలో ఈ విషయం మీద చర్చ జరుగు తున్నప్పుడు కొట్లాటలు జరిగి సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. రూలింగ్‌పార్టీ బర్తరఫ్ కోరుతూ రాష్ట్రం లో పలు చోట్ల ర్యాలీలు జరిగాయి. బందీల సందోహం లో విధ్వంసకాండ తలెత్తింది. పోలీసులు లాఠీచార్జి ఫైరింగ్ చేయాల్సివచ్చింది. మరికొన్ని చావులూ సంభ వించాయి.

పార్లమెంట్‌లోనూ ఇదే విషయం మీద స్పెషల్




ఎ.నెమిని రెడ్డి, శ్రీ విద్యా రెసిడెన్షియల్ స్కూల్, పోస్టల్ కాలనీ, అదోని(మ), కర్నూల్-జిల్లా.

డిస్కషన్ జరిగింది. సి.బి.ఐ. రంగంలోకి దిగింది. మిలట్రీ ట్రూపులతో విశాఖపట్నం నిండిపోయింది. మృత్యునీడలో రోజులు దొర్లిస్తున్న పౌరులు పాలకవర్గాన్ని నిరసిస్తున్నారు.

ప్రజలకు ధైర్యం చెప్పడానికి కేంద్రంనుండి ఒక బృందం తరలివస్తోంది. ప్రతి పక్షనాయకులు, మేధావులు, జర్నలిస్టులు, అధికారులు అంతా తరలివస్తున్నారు.

ఆ బృందానికి పర్యవేక్షకులు ప్రధాన మంత్రి.

వాళ్ళు విశాఖపట్నం సందర్శించనున్నది-

మంగళవారం!!

మెసేజ్ ఇంటర్‌సెప్ట్ చేసిన నిపుణులబృందం అది మధ్య ప్రాచ్యం (మిడిలీస్ట్) నుండి వచ్చినట్లు నిర్ధారించింది.

స్పెషల్ ఫ్రీక్వెన్సీ కంప్యూటరైజ్డ్ సిగ్నల్ - అద్దెకు తీసుకున్న ఉపగ్రహం నుండి పంపబడింది.

బొంబాయి ప్రేలుడప్పుడూ ఇలానే జరిగింది. ఏ రోజు, ఏ ఊళ్ళో బ్లాస్ట్ కావాలో (జనసమర్థమయిన ఏ ప్రదేశాన్ని బ్లాస్ట్ చేయాలో) నిర్దేశించే సంకేతం.

దాన్ని రిసీవ్ చేసుకున్న అనుచరులు బాంబు ప్లాంట్ చేస్తారు. వాళ్ళనుకున్న ప్రకారం బాంబు పేలుతుంది.

పథకం ప్రకారం భారతదేశపు నైతికత్వం మీద దెబ్బకొట్టే విదేశీకుట్ర. కొన్ని నక్కలు, మరోసింహం ఉమ్మడిగా పన్నిన పన్నాగం.

"కానీ ఈమెసేజ్ మాటెలివిజన్‌లో ఎలావస్తోంది?" ఇంటరాగేట్ చేస్తోన్న సిబిఐ ఎస్పీని విసుగ్గా అడిగాడు రత్నాకర్. అతనికి సంబంధంలేని నేరాన్ని అతనిమీద రుద్దే ప్రయత్నం చేస్తోన్న ఎస్పీ వంక చూస్తూ అన్నాడు.

"మన దేశంలో వాడుకలోనున్న శబ్ద శోధక యంత్రాల్లకు దొరకని ఈ సిగ్నల్ అందుకోవడాన్ని స్పెషల్ రిసీవర్ సెట్ కావాలి. దాన్ని టీ.వి లోకి పంపించే ప్రత్యేకమైన ఏంటెన్నా కావాలి! అన్నట్లు మీ బ్రదర్ దుబాయ్‌లో పనిచేస్తున్నాడట కదా..." అతని మాటలకు రత్నాకర్‌కు ఒళ్ళు మండిపోతోంది. ఏంటెన్నామాట వినగానే పునీత్‌కి సడెన్‌గా గుర్తొచ్చింది.

"అవును మా ఎంటెన్నా పాడయిపోతే - ఆ వైర్లు సైమన్ అంకుల్ ఏంటెన్నాకి తగిలించాను, నేనే!" అన్నాడు

"హర్రియప్" అంటూ పునీత్‌తో మేడ పై భాగానికి పరిగెత్తాడు ఎస్పీ.

ఎనిమిది ప్లాట్లవాళ్ళ ఏంటెన్నాల్లోనూ ప్రత్యేకంగా ఉంది సైమన్‌ది. రత్నాకర్ టీ.వి. వైపు దానికి తగిలి ఉంది.

"ఈ సైమన్ ఎవడు?" అడిగాడు ఎస్పీ.

★ ★ ★

బజర్ శబ్దంవిని తలుపు తెరిచిన సైమనంకుల్‌కి స్రవంతి కనిపించింది.

"స్వీట్ గాళ్। ఈరోజు స్కూల్‌కి పోలేదా?"

"లేదు, మా స్కూలు ధ్వంసమయిందిగా" దాదాపు కన్నీళ్ళ పర్యంత మయింది స్రవంతి.

"అవునవును. భగవంతుడే రక్షించాడు మిమ్మల్ని. ఆరోజు కార్లో నేను వస్తుంటే త్రోవలో మీరిద్దరూ కనిపించారు. పికప్ చేసుకున్నాను అవునా?"

"అవునంకుల్."

టీపాయ్ దిగువ దొంతర్లగా పడిఉన్న పూళ్ళగుత్తులూ. రంగు రంగుల గులాబీలూ, చామంతులూ, బంతిపూలూ, మందార పూలూ స్రవంతిని ఆకర్షించాయి.

"అంకుల్, నాకో గులాబీ పువ్వు ఈయరూ?"

దీర్ఘంగా ఆ అమ్మాయిని చూశాడు సైమన్.

"ఇస్తానమ్మా- ఒక్కటేమిటి, ఒక బొకేనే ఇస్తాను! నువ్వు నేను చెప్పిన పని చేసి పెట్టాలి, చేస్తావా?"

"ఏమిటంకుల్?"

"రేపు ప్రధానమంత్రి మీ స్కూల్‌కి వస్తారు కదా! అతనికి నువ్వో పూలగుత్తి ప్రజంట్ చేయాలి-"

"ఎలా అంకుల్?"

"రేపు నాకార్లో నేనే తీసుకెళ్తాను. మీ ఇంట్లో చెప్పకు. పేపర్లో పి.ఎమ్‌తో నీ ఫోటో చూసి మీ అమ్మా, నాన్నా సర్‌ప్రైజ్ కావాలి. అప్పుడు వాళ్ళకు చెబ్దాం-"

"ఓ.కే. అంకుల్."

స్రవంతి వెళ్ళిపోయిన పది నిముషాలకు మళ్ళీ బజర్ మ్రోగితే తెరిచాడు సైమన్.

అతని మొహం మీద రెండు పిడిగుద్దులు పడ్డాయి.

స్టెన్ గన్‌లు అతని గుండెలకు గురిచేస్తూ ఇంట్లోకి జొరబడ్తోన్న కమెండోలు కన్పించారు.

"ఏమిటీ దౌర్జన్యం? ఎవరు మీరు?" బుసలు కొడ్తున్నాడు.

అతని చెంప ఛెళ్ళుమనిపించాడు ఎస్పీ.

ప్రధానమంత్రి కీయడానికి ఏర్పాటుచేసిన బొకేలో బాంబు కనిపించింది. సైమన్ జేబులో రిమోట్ కంట్రోలర్ దొరికింది.

పిల్లల్ని గుండెలకద్దుకుని భాషకందని తన్మయత్వంలో మునిగింది నందిని.

★ ★ ★

రిపబ్లిక్ డే!

పెరేడ్ గ్రౌండ్‌లో ఏనుగుమీద కూచున్న స్రవంతి ప్రక్కనున్న పునీత్‌ను అడుగుతోంది.

"అనవసరంగా ఒకరినొకరు ఎందుకు చంపుకుంటార్రా అన్నయ్యా?" ఒక్కక్షణం ఆలోచించి చెప్పాడు పునీత్.


"అది రాక్షసుల్లాంటి ఆ మనుషుల స్వభావం"

ఆకాశంలో ఎగురుతోన్న హెలికాప్టర్ ఆ పిల్లలమీద పూలవాన కురిపిస్తోంది.

ప్రధాన మంత్రి చిరునవ్వుతో స్వాగతం పలుకుతున్నారు.

రాష్ట్రపతి ఆశీర్వదిస్తూ చేతులూపుతున్నారు.

[illegible]
[illegible] - 2 - 477
[illegible]
భువనేశ్వర్ - 751 012.




బి.వి.ఎస్.బాబు, ఎ.పి.ఎస్.ఇ.బి.ఆఫీస్, తెనాలి-522 202.